ప్రజాశక్తి
ఆదివారం 18 ఆగస్టు 2024
5
కర్నూలు

ఫ్రీ ఓల్డ్ భూములపై సమగ్ర నివేదిక

- కలెక్టర్ పి రంజిత్ భాష

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని ఫ్రీ ఓల్డ్ భూములకు సంబంధించి సమగ్ర నివేదికను పంపాలని జిల్లా కలెక్టర్ పి .రంజిత్‌బాష రెవిన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో రెవెన్యూ సదస్సులు, హౌసింగ్, ఉపాధి హామీ తదితర అంశాల పై తహసీల్దార్లు, ఎంపిడిఒలతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వంద రోజులు, ఏడాది, ఐదేళ్ల లక్ష్యాలను ఏర్పరుచుకుని జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముందుగా వంద రోజుల ప్రణాళికలో కేటాయించిన లక్ష్యాలను సాధించే దిశగా మండల, జిల్లా స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. త్వరలో జరగనున్న రెవెన్యూ సదస్సులకు కూడా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జిల్లాలో 484 గ్రామ పంచాయతీలకు గాను ఇప్పటివరకు 376 చెత్త సంపద తయారీ కేంద్రాలు పూర్తి అయ్యాయని, పెండింగులో ఉన్న మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించి 100 రోజుల ప్రణాళికలో లక్ష్యంగా నిర్ణయించుకున్న 6,079 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఒడిఎఫ్ ప్లస్ సంబంధించి వంద రోజులో 60 గ్రామ పంచాయతీలను లక్ష్యంగా నిర్ణయించామన్నారు. 23న అన్ని గ్రామాల్లో ఒకేసారి గ్రామ సభలలో ఇంత వరకు జరిగిన ఉపాధి హామీ పనులు, 2025-26వ సంవత్సరాలకు ఏ పనులు ప్రతిపాదించాలన్నారు. జెసి బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఆర్‌డిఒలు, జిల్లా అధికారులు ఎంపిడిఒలు, తహశీల్దార్లు ,హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

వైద్యుల పోరాటం ఉధృతం

- ఆస్పత్రిలో వైద్య సేవలు నిలిపివేత
- ఎస్ఎఫ్ఐ, ఐద్వా, ప్రజా సంఘాల సంఘీభావం - ఐఎంఎ, మెడికల్ రెప్స్ మద్దతు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కోల్‌కత్తా వైద్య విద్యార్థినిపై హత్యాచారినికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ డాక్టర్లు చేపట్టిన పోరాటం ఉధృతంగా మారింది. ఈ పోరాటానికి మద్దతుగా ఐఎంఎ, ఎపి మెడికల్ సేల్స్ అండ్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ నిరసనలు తెలియజేశాయి. శనివారం జిల్లావ్యాప్తంగా ఆస్పత్రిలో వైద్యులు తమ విధులను బహిష్కరించి పోరాటానికి మద్దతుగా నిలిచారు. కేవలం అత్యవసర కేసులకు మాత్రమే వైద్య సేవలను అందించారు. శనివారం కర్నూలులో వైద్యులు, వైద్య విద్యార్థులు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజ్ విహార్ కూడలి నుంచి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల వరకు జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపుమేరకు వైద్య సేవలను నిలిపివేసి నిరసనకు సంఘీభావం తెలియజేశారు. ప్రభుత్వాస్పత్రి ఆవరణంలో నిర్వహించిన నిరసనకు ఎస్ఎఫ్ఐ, ఐద్వా, ప్రజా సంఘాలు సంఘీభావం తెలిపాయి. నిరసన శిబిరాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, నగర అధ్యక్ష, కార్యదర్శులు అమర్, సాయి, ఉదయ్, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలమ్మ, ఇతర నాయకులు శ్యామలమ్మ, వేణమ్మ సందర్శించి మద్దతు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడారు. కోల్‌కతా ఆర్‌జి కార్ మెడికల్ కళాశాలలో వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ ఘటనపై సిబిఐతో దర్యాప్తు చేయించి బాధితురాలు కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేసే వైద్యులకు రక్షణ కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. జూడాల సంఘం నాయకులు అచ్యుత్, పవన్ కళ్యాణ్, భరత్, భార్గవ్ మాట్లాడుతూ వైద్యురాలి హత్యాచార ఘటన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే కర్నూలు మెడికల్ కళాశాల హస్టల్‌లోని విద్యార్థినిలకు కూడా రక్షణ చర్యలు కల్పించాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేసేంతవరకు తమ పోరాటం కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.

కలెక్టరేట్ ఎదుట వైద్యులకు మెడికల్ రెప్స్ సంఘీభావ నిరసన

కలెక్టరేట్ ఎదుట మెడికల్ రెప్స్ నిరసన

ఆంధ్రప్రదేశ్ మెడికల్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మెడికల్ రెప్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు వెంకట్, కోటేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బసవరాజ్, శేషాద్రి, రాష్ట్ర నాయకులు సురేంద్ర, మారుతి, జిల్లా సీనియర్ నాయకులు ప్రసాద్ శర్మ పాల్గొని మాట్లాడారు. కలకత్తా ఆర్‌జి కర్ మెడికల్ కాలేజ్‌లో పీజీ విద్యార్థిపై అత్యాచారం చేయడమే కాకుండా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జూనియర్ డాక్టర్ల పోరాటానికి మద్దతుగా దేశవ్యాప్తంగా రెండు లక్షల పైన మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ వారి మద్దతు తెలియజేస్తున్నారన్నారు. నిందితులను గుర్తించి వెంటనే వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. వైద్యులకు రక్షణ చట్టం తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు.

ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం

- డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, ఐఎంఎ జిల్లా కార్యదర్శి

కోల్‌కత్తాలో వైద్యురాలి అత్యాచారం, హత్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆ ఘటనకు నిరసనగా కార్యక్రమాలు చేపడుతున్నాం. జూడాల ఆందోళనకు మద్దతు తెలిపాం. ఆదివారం ఎన్‌టిఆర్ కూడలి నుంచి రాజ్ విహార్ కూడలి వరకూ ధర్నా చేపడతాం. సాయంత్రం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తాం. ఐఎంఎ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు భవిష్యత్తు ఆందోళనలు చేపడతాం.

పని ప్రదేశాల్లో రక్షణ కల్పించాలి

- డాక్టర్ మాధవి శ్యామల, ఐఎంఎ జిల్లా కోశాధికారి

అమ్మాయిలు చదువుకోవడమే చాలా తక్కువ. అందులో మెడిసిన్ ఇంకా కష్టం. అలా పిజి సీటు సాధించి చదువుతున్న అమ్మాయిని డ్యూటీలో ఉండగా దారుణంగా అత్యాచారం చేసి హత్య చేయడం హేయం. మహిళలకు ఇంటా, బయటా ఎక్కడా రక్షణ లేకుండా పోయింది. భద్రత లేని సమాజంలో వైద్య సేవలు ఎలా అందించాలి. ఎన్ని చట్టాలున్నా అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. వైద్యులకు పని ప్రదేశాల్లో రక్షణ కల్పించాలి.

వైద్య విద్యార్థినిలకు రక్షణ కల్పించాలి

- భరత్, జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షులు

కలకత్తాలో జరిగిన ఘటన చూసిన రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని వెంటనే కర్నూలు ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని వైద్య విద్యార్థులకు రక్షణ కల్పించాలి. హాస్టల్ క్యాంపస్‌లోకి ఇతర వ్యక్తులను అనుమతించకుండా సీసీ కెమెరాలను పెట్టాలి. ఆస్పత్రిలోని వార్డుల్లో రక్షణ చర్యలను కల్పించేందుకు సిబ్బందిని నియమించాలి.

రాజ్ విహార్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

డాక్టర్లసమ్మెనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా

ఇంజినీరింగ్ సాహసం..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్ణాటక రాష్ట్రం హొస్పేట్‌లో ఉన్న ఆంధ్ర, కర్ణాటక రాష్ట్ర ప్రజల జీవనాడి తుంగభద్ర డ్యామ్ 19వ గేట్ గత శనివారం రాత్రి 11 గంటల సమయంలో ప్రమాదవశాత్తు కొట్టుకుపోయింది. గేట్ చైన్‌లింక్ తెగిపోవడంతో గేట్ ఊడిపోయి వరద నీటిలో కొట్టుకుపోయింది. ఆ ప్రాంతం ద్వారా 35 వేల క్యూసెక్కుల నీరు వృథాగా పోయింది. గేట్ కొట్టుకుపోయిన స్థలంపై ఎక్కువ ఒత్తిడి పడకుండా మరో 32 గేట్ల ద్వారా మొత్తం మీద 90 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. 12వ తేదీ ఉదయం నుంచే నిపుణులు రంగంలోకి దిగారు. కొట్టుకుపోయిన గేటు స్థానంలో తాత్కాలిక గేటు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ నిపుణులు, అధికారులు నిర్ణయించారు. అందుకు సిడబ్ల్యూసి నుంచి కూడా ఆమోదం లభించింది. డ్యాము గేట్ల నిపుణులు కన్నయ్య నాయుడు పర్యవేక్షణలో పనులను ప్రారంభించారు. ప్రస్తుతం గేటు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగించారు. గేటు మొత్తం పొడవు 60 అడుగులు కాగా వెడల్పు 20 అడుగులుగా ఉంది. మొత్తం గేటును ఒకే సారి తయారు చేయడం సాధ్యంకాదని భావించిన అధికారులు ఐదు ప్లేట్లుగా గేటు ఫ్యాబ్రికేషన్ పనులు చేపట్టారు. ఆ పనులు మూడు సంస్థల్లో సాగాయి. మూడు ప్లేట్లను బళ్లారిలోని జిందాల్ స్టీల్స్, ఒక ప్లేటును హిందుస్థాన్ కంపెనీ, మరో గేటును హొస్పేటలోని నారాయణ ఇంజనీరింగ్ కంపెనీ చేశాయి. 12 అడుగుల నీటి ప్రవాహం ఉండగానే గేట్లను అమర్చాలని అధికారులు నిర్ణయించారు. నీటి ప్రవాహం ఉన్న సమయంలో గేటును అమర్చడం కష్టమని, అయినా సాహసం చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. కొట్టుకుపోయిన గేటు స్థానంలో తాత్కాలిక గేటు ఐదు ప్లేట్లను ఉంచి వెల్డింగ్ చేసేలా ప్రణాళికలు రూపొందించారు. సిబ్బంది, కార్మికులు నీటిలోకి దిగేందుకు వీలుగా ప్రత్యేక ప్లాట్‌ఫారంను ఏర్పాటు చేశారు. తుంగభద్ర డ్యాముకు తాత్కాలిక గేటు అమరికలో శుక్రవారం తొలి విజయం సాధించారు. కొట్టుకుపోయిన గేటు స్థానంలో సాయంత్రానికి రెండు ప్లేట్లను కూర్చొబెట్టడంలో అధికారులు విజయం సాధించారు. శుక్రవారం ఉదయం తాత్కాలిక గేటు ఐదు ప్లేట్లలో ఒక ప్లేటును అమర్చేందుకు ప్రయత్నం చేశారు. ప్లేటు రెండు అంగుళాలు ఎక్కువగా ఉండటంతో ప్లేటును గేటు స్థానంలో కూర్చొబెట్టేందుకు ఆటంకం ఏర్పడింది. దీంతో డ్యాము గోడను రెండు అంగుళాల మేర కట్ చేసి ప్లేటును పై నుంచి కిందకు దించారు. తొలుత 38 టన్నులు ఉన్న ఒక గేటును, 28 టన్నులు ఉన్న మరో గేటును కిందకు దించారు. శనివారం మరో రెండు ప్లేట్లను అమర్చారు. మొత్తం నాలుగు ప్లేట్ల అమరిక పూర్తయింది. దీంతో ఆ గేటు ద్వారా నీటి వృథా 14వేల క్యూసెక్కులకు తగ్గింది. తాత్కాలిక గేటు అమరిక పనుల్లో మూడు క్రేన్లను, రెండు హిటాచీలను వినియోగించారు. గేటు అమరిక కోసం 50 మంది కార్మికులు పనుల్లో నిమగ్నమయ్యారు. తాత్కాలిక గేటు అమర్చడంతో ఆ గేటు ద్వారా నీటి ప్రవాహం తగ్గింది. ఒక రకంగా చెప్పాలంటే ఇది ఇంజనీరింగ్ సాహసమే..

సర్దుబాటుపై ఆగ్రహం : గత ప్రభుత్వం జారీ చేసిన 117 జిఒను అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని నారా లోకేష్ ఎన్నికల సందర్భంలో ప్రకటించారు. ఇప్పుడు విద్యాశాఖ మంత్రిగా ఉన్న లోకేష్ జిఒ 117 ప్రకారం ఉపాధ్యాయుల సర్దుబాటుకు చర్యలు తీసుకోవడం పట్ల ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం అసంబద్ధంగా వ్యవహరిస్తోందని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. గత సోమవారం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియకు విద్యాశాఖ అధికారులు జాబితాలను విడుదల చేశారు. విద్యాశాఖ విడుదల చేసిన జాబితాలో ఉపాధ్యాయుల సీనియారిటీ లెక్కింపులో అశాస్త్రీయ విధానంతో చేయడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు మండిపడ్డాయి. ప్రస్తుతం తాత్కాలికంగా పాఠశాలలో ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను వాయిదా వేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులను జారీ చేసింది. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సీనియారిటీ లెక్కింపులో విద్యాశాఖ తీసుకున్న చర్యల పట్ల ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నారు. ఉపాధ్యాయులు పుట్టిన తేదీ ఆధారంగా సీనియారిటీని లెక్కించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా పంద్రాగస్టు వేడుకలు : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. కర్నూలు పోలీస్ పరేడ్ మైదానంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, నంద్యాల పోలీస్ పరేడ్ మైదానంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. సాయుధదళాల గౌరవ వందనం స్వీకరించారు. ప్రతిభ కనపరచిన వివిధ శాఖల ఉద్యోగులకు అవార్డులను అందజేశారు. ప్రభుత్వ శాఖల శకటాలను ప్రదర్శించారు. పలు పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అన్ని మండలాల్లోనూ మండల, పంచాయతీ కార్యాలయాల్లో, పాఠశాలల్లో జాతీయ జెండా రెపరెపలాడింది.

జాతీయ క్యారమ్స్ దిగ్గజం లిఖిత అస్తమయం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన జాతీయ క్యారమ్స్ క్రీడాకారిని వి.లిఖిత రెడి (24) శనివారం తెలంగాణ రాష్ట్ర జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం ధర్మవరం స్టేజి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. నంద్యాల జిల్లా తిమ్మాపురం లిఖిత రెడ్డి ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి సుమారు 8 సార్లకు పైగా రాష్ట్ర జట్టుకు తరుపున అనేక పతకాలు సాధించారు. పదికి పైగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఆమె తల్లి తండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తున్నారు. హైదరాబాద్‌నుంచి కర్నూలు వస్తుండగా కారుప్రమాదంలో మృతి చెందింది. లిఖిత రెడ్డి మృతికి రాష్ట్రక్యారమ్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నీరజ్ కుమార్ సంపతి, అబ్దుల్ జలీల్, కర్నూలు జిల్లా కార్యదర్శి చెన్నకేశవరాజు, జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు జగదీష్ గౌడ్, శ్రీనివాసులు సంతాపం ప్రకటించారు.

లిఖితరెడ్డి ఫైల్ ఫోటో

శ్రీవెఉంటసాయి రాయల్ డెంటర్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎంఏ.గఫూర్

మెరుగైన వైద్యంతో అందరి మన్ననలు పొందాలి

శ్రీవెఉంటసాయి రాయల్ డెంటర్ క్లినిక్ ప్రారంభంలో ఎంఏ.గఫూర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజాసేవకు అంకితమై ప్రజలకు మెరుగైన వైద్యం అందించి అందరి మన్ననలు పొందాలని, కర్నూలులో దంత సమస్యలు ఉన్నాయంటే శ్రీ వెంకట సాయి రాయల్ డెంటల్ క్లినిక్ డాక్టర్ సాయి పంకజ్ వద్దకు వెళ్లాలనే విధంగా పేరు తెచ్చుకోవాలని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఏ. గఫూర్ ఆకాంక్షించారు. శనివారం చల్లా వారి వీధిలోని శ్రీవెంకటసాయి రాయల్ డెంటల్ క్లినిక్ ను ఎంఏ. గఫూర్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. సుశీల నేత్రాలయం ప్రముఖ కంటి వైద్యులుసుధాకర్‌రావు ప్రథమంగా తమ పళ్ళను పరీక్షించుకొని వైద్య సేవలను ప్రారంభించారు. ఆర్‌ఆర్. హాస్పిటల్ అధినేత డాక్టర్ బాల మద్దయ్య, డాక్టర్ ధనుంజయ, ఐద్వారాష్ట్ర నాయకురాలు పి.నిర్మల, జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు, మహిళా నాయకులు, సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయ్, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహా, ఎడిషన్ ఇన్‌ఛార్జి పి.చంద్రయ్య, ప్రజాశక్తి సిబ్బంది, సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి రాముడు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



డాక్టర్ సుధాకర్‌రావుకు జ్ఞాపికను అందజేస్తున్న డాక్టర్ పంకజ్

పలుచోట్ల మైనింగ్ అధికారుల తనిఖీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లాలో పలుచోట్ల మైనింగ్ అధికారులు శనివారం గనులను తనిఖీ చేశారని మైనింగ్ శాఖ జిల్లా డిడి టి.రాజశేఖర్ అన్నారు. డోన్ మండలం చిన్న మల్కాపురంలో డోలమైట్ గనులను, వెల్దుర్తి మండలం కలుగోట్ల గ్రామంలో ఎల్లో ఓకర్ గనులను తనిఖీ చేశారన్నారు. లీజ్ దారులకు కేటాయించిన భూ విస్తీర్ణం పరిధిలో తవ్వకాలు నిర్వహిస్తున్నారా? లేక అతిక్రమించి తవ్వకాలు చేపడుతున్నారా? అన్న విషయంపై ఈ తనిఖీలు చేసినట్లు వారు చెప్పారు. తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షానికి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారికి ఎపి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఆదోని మార్కెట్ యార్డ్‌లో వర్షం వల్ల వేరుశనగ పంట నీటిలో మునిగిపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పిఎల్. వరలక్ష్మికి ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆమె కార్యాలయంలో వినతిని అందించారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, కర్నూలు మండలం గౌరవ అధ్యక్షులు గొందిపర్ల మాజీ సర్పంచి జి ఆంజనేయులు మాట్లాడుతూ శుక్రవారం ఆదోనిలో వర్షంవల్ల 5722 బస్తాలు నీట మునిగి ముద్దయిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. నష్టపోయిన వేరుశనగ ఇతర, రైతులను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను డిమాండ్ చేశారు. ఆదోని మార్కెట్ లో తార్పాలిన్ల సౌకర్యం లేక మార్కెట్ అధికారుల నిర్లక్ష్యం వల్ల చేతికొచ్చిన పంట మార్కెట్ కు తీసుకొస్తే కొంతైనా బాగుపడతామని ఆశతో ఉన్న రైతులకు తీరని అన్యాయం జరిగిందని రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో రైతుల నుండి సెస్సు వసూలు చేయడం తప్ప కనీసమైన సౌకర్యాలు లేక పైకప్పు లేక కాలువలు శుభ్రం లేక కురిసిన వర్షం అంతా కూడా వేరుశనగ పంట పైన పొంగి పొర్లడంతో మార్కెట్‌కు తెచ్చిన వేరుశనగ పంట అంతా నాశనం అయిపోయిందని, దీనికి మార్కెట్ శాఖ అధికారులు బాధ్యత వహించాలన్నారు. ఒక క్వింటాలు ధర రూ.6,500 కనిష్టంగా పలికిన ధర ఇప్పుడు వ్యాపారస్తులు ఒక క్వింటాలకు ఐదు కిలోలు తరుగు తీసేసి కొనుగోలు చేస్తామని చెప్పారన్నారు. దీని నష్టం మార్కెట్ శాఖ భరించి రైతులకు పూర్తి నష్టపరిహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి రైతు సంఘం నేతలు ఇచ్చిన వినతిపత్రాన్ని స్వీకరించి సానుకూలంగా స్పందించారు. వెంటనే మార్కెట్ యార్డ్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు పంపి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని ఆమె హామీ ఇచ్చారు. రైతులకు న్యాయం జరగకపోతే నష్టపోయిన రైతులందరిని కలుపుకొని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శివన్న, ఉల్చాల మద్దిలేటి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలి

కొవ్వొత్తులతో ఐద్వా నిరసన

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని క్యాండిల్స్‌తో కర్నూలు జిల్లా పరిషత్ దగ్గర ఐద్వా ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిరసన తెలిపారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు కె.అరుణ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. శ్రామిక మహిళా సంఘం కన్వీనర్ పి.నిర్మల, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు మాట్లాడుతూ ఆర్‌జికార్ మెడికల్ కాలేజీలో పీజీ డాక్టర్‌ను ఆగస్టు 9న మానవ మగాలు పాశవీకంగా క్రూరంగా అత్యాచారం , హత్య చేసి విగతజీవిగా మార్చారన్నారు. ఆ కళాశాల ప్రిన్సిపల్ దుచ్చర్యను కప్పిపుచ్చి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేయగా పోస్టుమార్టం నివేదికలో నిజానిజాలు బయటపడి ఒకరికన్నా ఎక్కువ మంది అత్యాచారం చేశారని నివేదికలో వెల్లడైందన్నారు. ఇంతవరకు అత్యాచారం చేసిన దుండగులను అరెస్ట్ చేయకుండా వాళ్లను పట్టుకోలేదంటే అక్కడ ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు మహిళలకు రక్షిస్తామని, అండగా ఉంటామని మాటలు రూపంలో ఉత్తర ప్రగల్బాలు పలకడం తప్ప ఆచరణలో అమలు చేయడం లేదని ఎద్దేవా చేశారు. మరమ్మతుల పేరుతో ఒక్కసారి వేలమంది గుండాలతో డాక్టర్లపై దాడి చేసి ఆసుపత్రిని ధ్వంసం చేసి మరోసారి సాక్షులను తారుమారు చేసే ప్రయత్నం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషిస్తుందని విమర్శించారు ఇప్పటికైనా చట్టాలను సక్రమంగా అమలు చేసి మహిళలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హత్యకు గురయిన డాక్టర్ కుటుంబానికి అన్ని రకాలగా రక్షణ కల్పించి అమ్మాయిపై అఘాయిత్యానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామనేసి హెచ్చరించారు. ఐద్వా ఓల్డ్ సిటీ అధ్యక్షురాలు రసీదా ఎస్ఎఫ్ఐ కర్నూల్ నగర కార్యదర్శి సాయి ఉదయ్ మద్దతు తెలిపారు. ఐద్వా నాయకులు పర్వీను, వేనమ్మ , కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ఐద్వా నిరసన

ఈక్రాపు నమోదు చేసుకోవాలి : ఎఇఒ

ప్రజాశక్తి-మద్దికేర

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పంట వేసుకున్న ప్రతి రైతుపొలంలో ఈ క్రాపు నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఎఇఒ భోజరాజు తెలిపారు. మండల ఆవరణలోని హంప రెవెన్యూ గ్రామ రైతు పొలంలో శనివారం క్రాప్ బుకింగ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు పొలంలో వేసిన ఆముదాల పంటను ఆయన పరిశీలించారు. క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతులకు ఇన్సూరెన్స్, పంట నష్టపరిహారం, పంటమద్దతుధర, వంటి పలు రకాలైన అవకాశాలు ఉంటాయన్నారు. ముఖ్యంగా రైతు భరోసా పరిధిలో ఉన్న రైతులకు వ్యవసాయ అధికారుల ద్వారా క్రాఫ్ట్ బుకింగ్ చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఇఒ అనంతరాజు, విఆర్ఒ రషీద్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం ఆహారం తయారు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమల్లో భాగంగా మెనూ ప్రకారం ఆహారం తయారు చేయాలని కల్లూరు మండల విద్యాశాఖ అధికారి వనజ కుమారి పేర్కొన్నారు. శనివారం కల్లూరు మండలం లోని పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఎఇఒ వనజ కుమారి పర్యవేక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం కింద తయారు చేసిన ఆహారాన్ని రుచి చేశారు. నాసిరకంగా ఆహారం తయారు చేయకుండా నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.

పోక్సో కేసులో నిందితునికి రిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

మైనర్ బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన విషయంలో నిందితునిపై ఫోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామని కర్నూలు వన్‌టౌన్ పిఐ పవన్ కుమార్ అన్నారు. స్టేషన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూలు నగరం జోహరాపురం ఇందిరమ్మ కాలనీకి చెందిన కల్లె శివకుమార్ మైనర్ బాలికపై అసభ్యకరంగా వ్యవహరించిన నేపథ్యంలో క్రైమ్ నెంబర్ 94/2024 అండర్ సెక్షన్ 10 రెడ్ విత్ 9(m)12,11(1) పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. నిందితున్ని కర్నూలు జెఎఫ్‌సిఎం (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు)లో హాజరు పరచగా ఈ నెల 30వరకు రిమాండ్ విధించిందన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ సోమ్లా నాయక్ పాల్గొన్నారు.

రైతులందరికీ పంట నష్టపరిహారమివ్వాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోని రూరల్

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రైతులందరికీ పంట నష్టపరిహారమివ్వాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వర్షం కురిసి నష్టపోయిన రైతులను కలిసి పంట నష్ట వివరాలను తెలుసుకున్నారు. శనివారం మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సుమారు 6 వేల బస్తాలు వేరుశనగ పంట మార్కెట్‌కు రాగా సగం పంటను మాత్రమే కొనుగోలు చేశారని తెలిపారు. మిగతా సగం పంటను పూర్తిగా వర్షంలో తడిసిందని కొనుగోలు చేయకుండా వెళ్లిపోయారని చెప్పారు. రైతులు రూ.లక్షలు నష్టపోయారని, దీనికి ప్రభుత్వ అధికారులు బాధ్యత వహించాలని తెలిపారు. మురుగు కాలువలు ఏర్పాటు చేయకపోవడం కూడా పంట తడిసిపోవడానికి మరో కారణమని చెప్పారు. పంటను ఆరబెట్టే విధానం రద్దు చేయాలని, మురుగునీటి కాలువలు తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. రైతు సంఘం మండల నాయకులు తిక్కన్న, మునిస్వామి, రైతులు పాల్గొన్నారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టం తేవాలి

- రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గురుశేఖర్

ప్రజాశక్తి - ఆదోని

మాట్లాడుతున్న గురుశేఖర్

ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ తరహాలో రజకులకు సామాజిక రక్షణ చట్టం తేవాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.గురు శేఖర్, జిల్లా అధ్యక్షులు సి.ముక్కన్న డిమాండ్ చేశారు. శనివారం ఆదోని సిఐటియు కార్యాలయంలో నాగరాజు అధ్యక్షతన డివిజన్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. రజక మహిళలు, బాలికలపై అత్యాచారాలను అరికట్టేందుకు పటిష్టమైన చట్టం అమలు చేయాలని కోరారు. రజక కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని, రజక వృత్తిదారులకు కార్పొరేషన్ ద్వారా 90 శాతం సబ్సిడీతో ప్రతి కుటుంబానికీ రూ.లక్ష రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న దోభీ పోస్టులను భర్తీ చేసి యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. రాష్ట్రంలో ఇళ్ల దగ్గర వృత్తి చేసే వారందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని, లేకపోతే దశలవారీ పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఆస్పరి ఈరన్న, సంతేకుడ్లూరు చిదానంద, బదినేహాల్ మహేష్, ఆదోని పట్టణ నాయకులు ఉరుకుంద, ఈరన్న, మల్లప్ప, మల్లయ్య, కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు నుంచి కోడుమూరు వరకు
రోడ్డు వేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు నుంచి కోడుమూరు వరకు రోడ్డు వేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నాగేష్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని శివ సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కర్నూలు నుంచి ఆదోని వరకు వెళ్లే ప్రధాన రహదారిలో కోడుమూరు నుంచి ఎమ్మిగనూరు పట్టణం వరకు రోడ్డు చాలా అధ్వానంగా ఉందని తెలిపారు. ఈ రోడ్డు గుండా రోజూ వందలాది వాహనాలు, వేలాదిమంది ప్రజలు ప్రయాణం చేస్తుంటారని చెప్పారు. రోడ్డు అధ్వానంగా తయారయి ప్రజలు ఇబ్బంది పడుతూ ప్రయాణం చేయాల్సి వస్తోందని తెలిపారు. రోడ్డు సరిగ్గా లేకపోవడంతో ప్రమాదాలు జరిగిన పరిస్థితి ఉందన్నారు. ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. వేలాదిమంది ప్రయాణం చేసే రహదారిపై అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలవుతున్నా ఎమ్మెల్యే స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రజల రక్షణ కోసం రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రభుత్వ కార్యాలయాలను, ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. డివైఎఫ్ఐ నాయకులు హుస్సేని, శ్రీనివాసులు, కెవిపిఎస్ నాయకులు ఆంథోని, అరుణ్, ఆటో నాయకులు ఆమోసు, రామాంజనేయులు, శివ, రాజు పాల్గొన్నారు.

రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

వైద్యురాలి హత్యాచార నిందితులను శిక్షించాలి

- ఐఎంఎ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

కోల్‌కత్తా నగరంలోని వైద్యురాలిని అత్యాచారం చేసి, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఐఎంఎ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఐఎంఎ ఆధ్వర్యంలో ఆదోనిలో నిరసన చేపట్టారు. ప్రయివేట్ ఆస్పత్రుల్లో అవుట్ పేషెంట్ సేవలను నిలిపివేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి ప్రభుత్వాస్పత్రి నుంచి మున్సిపల్ రోడ్డు గుండా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి, నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఐఎంఎ ఆదోని ప్రెసిడెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, సెక్రటరీ, ట్రెజరీ ఆదిత్య, మధుసూదన్, జాయింట్ సెక్రటరీ సందీప్, మహిళా విభాగం ప్రతినిధి డాక్టర్ మనీషా, సిడబ్ల్యుసి మెంబర్ గోపీనాథ్, ఎస్‌డబ్ల్యుసి మెంబర్ కృష్ణమూర్తి, హరీష్, కశ్యప్, మాజీ ప్రెసిడెంట్ సైఫుల్లా, సెంట్రల్ అడ్వయిజర్ కమిటీ మెంబర్ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడారు. జూనియర్ డాక్టర్లకు రక్షణ కల్పించాలని, పిజి విద్యార్థి మౌనిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. చివరికి ప్రజల ప్రాణాలను కాపాడే డాక్టర్లకు ఆస్పత్రిలో రక్షణ లేకుండా పోతోందన్నారు. విధుల్లో డాక్టర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సీనియర్ డాక్టర్లు కృష్ణ గోపాల్, కృష్ణదేవరాయలు, రమామని, ఉజ్జినయ్య, ప్రసన్న కుమారి, మధు ఆస్పత్రి వైద్యులు మనోజ్ కుమార్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సూరి, గౌస్ పాల్గొన్నారు. అలాగే పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సూరి, గౌస్ పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలంలోని పెద్దహరివాణం, పెద్దతుంబలం పిహెచ్‌సిలలో వైద్య సిబ్బంది నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యులు ఇమ్రాన్, దివ్య మాట్లాడారు. వారం రోజులుగా ఈ ఘటనలో ప్రభుత్వం నిందితులను పట్టుకొని చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్యులు వైద్య సేవలు బంద్ చేసి వారికి మద్దతుగా నిలిచారు. ప్రయివేట్ డాక్టర్లు కూడా వీరికి మద్దతుగా నిలిచి దోషులను వెంటనే పట్టుకుని శిక్షించాలని కోరారు. సిబ్బంది స్టాఫ్ నర్స్ మజీద్, ఫార్మాసిస్ట్ వాసుదేవ్ రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్స్ సుమలత, సిహెచ్‌ఒలు పాల్గొన్నారు. **ఆలూరు** ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారం నిర్వహించి నిరసన చేపట్టారు. ఆలూరు సిహెచ్‌సి వైద్యులు షేక్ వహీద్, రామకృష్ణ, ఫయాజ్ ఉన్నీసా, టిబి సూపర్‌వైజర్ గోపాల్ పాల్గొన్నారు. **దేవనకొండ** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని డాక్టర్లు కల్యాణ్, విజయభాస్కర్, వైద్య సిబ్బంది నిరసన చేపట్టారు. హెల్త్ సూపర్‌వైజర్లు సాయిబాబా, రంగస్వామి, శ్రీధర్ పాల్గొన్నారు. **మంత్రాలయం** రాఘవేంద్ర సర్కిల్‌లో ఆందోళన చేపట్టి, తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. డిప్యూటీ తహశీల్దార్ రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. మండల వైద్యాధికారులు డాక్టర్ గోవిందమ్మ, డాక్టర్ భావన, డాక్టర్ వసంత మాట్లాడారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, షబ్బీర్ బాష, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్, ఎపిడబ్ల్యుజె నియోజకవర్గ అధ్యక్షులు జయరాజు మద్దతు తెలిపారు. సూపర్‌వైజర్ మాధవస్వామి, ఫార్మాసిస్టు వేణుగోపాల్, కంప్యూటర్ ఆపరేటర్ రాజు, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని ప్రయివేట్ హాస్పిటల్స్ డాక్టర్లు, నర్సులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించి, స్థానిక సోమప్ప సర్కిల్‌లో నిరసన చేపట్టారు. అనంతరం జూనియర్ డాక్టర్లకు రక్షణ కల్పించాలని, మౌనిత కుటుంబానికి న్యాయం చేయాలని నినదించారు. డాక్టర్ మాలకొండయ్య, డాక్టర్ గౌడప్ప గౌడ్, డాక్టర్ శిల్పా, డాక్టర్ కెఎస్.రఘు, డాక్టర్ ఈశ్వర్ రెడ్డి, డాక్టర్ హేమంత్ కుమార్, డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ చిరంజీవి, డాక్టర్ వై.నవీన్ కుమార్, డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆదోనిలో వినతిపత్రం ఇస్తున్న వైద్యులు, నాయకులు

మంత్రాలయంలో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

ఆలూరులో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

దేవనకొండలో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

ఎమ్మిగనూరులో నిరసన తెలియజేస్తున్న వైద్యులు

బాధిత రైతులకు పరిహారమిచ్చేందుకు కృషి

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని మార్కెట్ యార్డులో వర్షానికి నష్టపోయిన రైతులకు నష్టపరిహారమిచ్చే విధంగా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథితో మాట్లాడతామని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ తెలిపారు. నష్టపోయిన వేరుశనగ రైతులను శనివారం ఆమె పరామర్శించారు. మార్కెట్ యార్డు సెక్రటరీతో కలిసి నష్టపోయిన రైతుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పట్టణంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి రైతుల వేరు శనక్కాయలు నీటిలో కొట్టుకుపోయాయని తెలిపారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మార్కెట్‌కు తీసుకొస్తే రైతులకు నష్టం వాటిల్లిందని చెప్పారు. ప్రభుత్వాధికారులతో మాట్లాడి నష్టపరిహారం వచ్చే విధంగా చూడాలని కోరారు.

రైతులతో మాట్లాడుతున్న గుడిసె కృష్ణమ్మ

వయనాడ్ బాధితులను ఆదుకుందాం

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - ఆలూరు

కేరళలోని వయనాడ్ వరదలో సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకుందామని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు, మండల కార్యదర్శి ఈరన్న కోరారు. శనివారం రైతుసంఘం ఆధ్వర్యంలో ఆలూరు మండలం అగ్రహారం గ్రామంలో రైతులు, వ్యవసాయ కూలీలతో కలిసి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేరళ రాష్ట్రం వయనాడ్‌ను వరదలు ముంచెత్తడంతో అక్కడి ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కొండ చరియాలు విరిగిపడి దాదాపు 400 మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. కొంతమంది వరదల్లో కొట్టుకుపోయి గల్లంతయ్యారని తెలిపారు. వయనాడ్ వరద బాధితులను ఆదుకునేందుకు సహాయం చేసిన అగ్రహారం గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు. సేకరించిన రూ.3,100ను కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేస్తామని చెప్పారు. రైతుసంఘం మండల నాయకులు శేఖర్, కృష్ణ, విఠల్, నారాయణ పాల్గొన్నారు.

అగ్రహారంలో విరాళాలు సేకరిస్తున్న నాయకులు

కౌతాళం సిఐగా అశోక్ కుమార్

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం సిఐగా అశోక్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. శనివారం ఆయన మాట్లాడారు. మండలంలో శాంతిభద్రతలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అందరి సహకారంతో ప్రజలకు సేవలు అందిస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు

- మున్సిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి తెలిపారు. శనివారం ఆదోనిలోని 40వ వార్డులో వెలసిన శ్రీపర్తాపురం మారమ్మ దేవాలయం సమీపంలో రహదారులను పరిశీలించారు. హిందూ శ్మశాన వాటికకు వెళ్లే దారిని సరి చేసి, మట్టికి వెళ్లే వారికి నీటి సమస్య రాకుండా చూడాలని, వీధి దీపాలను సరి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎఇ రాజశేఖర్, హరి, నాయకులు దుర్గప్ప, తిమ్మప్ప, శిల్మప్ప, సోము, బుజ్జప్ప పాల్గొన్నారు.

అధికార దుర్వినియోగానికి పాల్పడితే
కోర్టు మెట్లు ఎక్కాల్సిందే...

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

మండల అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడితే కోర్టు మెట్లు ఎక్కాల్సిందేనని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి హెచ్చరించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అమ్రేష్ అధ్యక్షతన ఎంపిడిఒ సుబ్బరాజు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడారు. రాజకీయాలకతీతంగా మండల ప్రజలకు సేవలు అందించాలని పేర్కొన్నారు. మండలంలో వివిధ కార్యాలయాల్లో పని చేస్తున్న వారిని తొలగిస్తామని, తప్పుకోవాలని వేధింపులకు గురి చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అధికారాలకు లోబడి పని చేయాలని, ఇష్టానుసారంగా పనిచేస్తామంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. 'ఇన్‌ఛార్జీలు చెప్పినారు. అధికార పార్టీ నాయకులు చెప్పినారు' అని తప్పుడు పనులు చేస్తే చూస్తూ ఊరుకోమని తెలిపారు. రాజకీయ వత్తిళ్లకు తలొగ్గి పని చేస్తే న్యాయపరమైన సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాలాభివృద్ధికి అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎపిఎం రాజశేఖర్ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. రైతులకు సంపూర్ణంగా సాగునీరు అందించాలని ఆదేశించారు. సాగునీటి సరఫరా విషయంలో రైతులకు ఇబ్బందులు కలిగితే ఎల్‌ఎల్‌సి అధికారులదే బాధ్యత అన్నారు. అంతకుముందు మండలంలోని నదీచాగి, కుంటనహాలు, సర్పంచి, ఎంపిటిసిలు, విద్యుత్ శాఖ అధికారిపై మండిపడ్డారు. గ్రామంలో ప్రజల ప్రాణాలు పోయిన తర్వాత స్పందిస్తారని నిలదీశారు. శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మార్చాలని కోరినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జడ్‌పిటిసి రాధా ప్రియదర్శిని, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్, కౌతాళం సర్పంచి పాల్ దినకరన్, ఎఇ శేషాద్రి, పశు వైద్యాధికారి జగదీష్, ఎంఇఒ శోభారాణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

డ్యాం గేటు పునరుద్ధరించినందుకు కృతజ్ఞతలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చిప్పగిరి

తుంగభద్ర డ్యామ్ 19వ గేటును పునరుద్ధరించినందుకు ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి తెలిపారు. శనివారం చిప్పగిరిలో ఆయన నివాసంలో మాట్లాడారు. తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోవడంతో అప్రమత్తమైన అధికారులు పునరుద్ధరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. డ్యామ్ పర్యవేక్షకుడు కన్నయ్య ఆధ్వర్యంలో గేటు మరమ్మతులు శరవేగంగా పూర్తి చేసి సీమ రైతులకు జీవం పోసిన అధికారులకు కృతజ్ఞతలుత తెలిపారు.

మహిళను రక్షించిన రక్షకభటుడు

చికిత్స పొందుతున్న మహిళ

ప్రజాశక్తి - మంత్రాలయం

తుంగభద్ర నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడుతున్న మహిళను రక్షించిన రక్షకభటుడు రంగస్వామి అధికారులు, గ్రామస్తుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. శుక్రవారం ఆదోని మండలం అలసంద గుత్తి గ్రామానికి చెందిన తిక్క లక్ష్మి కుటుంబ కలహాలతో మంత్రాలయం సమీపంలో ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. నదీతీరంలో బందోబస్తు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రంగస్వామి గమనించి నదిలో దూకి మహిళను రక్షించారు. అస్వస్థతకు గురైన తిక్క లక్ష్మిని ప్రథమ చికిత్స అనంతరం ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా ఆమె కోలుకొన్నారు. విషయం తెలుసుకున్న సిఐ రామాంజులు, ఎస్ఐ గోపినాథ్ రంగస్వామిని అభినందించారు.

ఉత్కంఠగా విద్యా కమిటీ ఎన్నికలు

- రెండు గ్రామాల్లో ఉద్రిక్తత

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలో వాయిదా పడిన విద్యా కమిటీ ఎన్నికలు శనివారం కొన్ని గ్రామాల్లో ప్రశాంతంగా, కొన్ని ఉత్కంఠగా ముగిశాయి. చిప్పగిరి డిపిఇపి పాఠశాల, బంటనహాల్ పాఠశాల ఎన్నికలు వివాదస్పదంగా ముగిశాయి. పత్తికొండ ఇన్‌ఛార్జీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఆలూరు సిఐ శ్రీనివాస్ నాయక్, చిప్పగిరి ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ ముందస్తు చర్యలు తీసుకుని సమస్య పెద్దది కాకుండా బందోబస్తు నిర్వహించారు. గొడవలు జరగకుండా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ ముందుగా ప్రతి గ్రామం తిరిగి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చిప్పగిరిలో పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జీ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సిఐ శ్రీనివాస్ నాయక్

ఎంఇఒ సావిత్రమ్మ ఎన్నికల సరళిని పరిశీలించారు. బంటనహాల్ గ్రామంలో టిడిపి మద్దతు దారులు బి.సరోజమ్మ ఛైర్మన్‌గా, రజనీ వైస్ ఛైర్మన్‌గా విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకున్నట్లు ప్రధానోపాధ్యాయులు తిరుమలమ్మ, ఉపాధ్యాయులు అనురాధ తెలిపారు. తిరుమలమ్మ మాట్లాడుతూ... బంటనహాళ్ గ్రామంలో విద్యా కమిటీ ఎన్నికను పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికకు సహకరించిన సర్పంచి సుశీలమ్మకు, గ్రామస్తులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా చిప్పగిరి పోలీసులు సాగర్, గోవింద బందోబస్తు నిర్వహించారు. అలాగే చిప్పగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూరిబా బాలికల విద్యాలయంలో ఎమ్మెల్యే విరుపాక్షి సహకారంతో కొక్క నాగరాజు, కేసరి పెద్దక్కలు ఛైర్మన్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విద్యా కమిటీ ఛైర్మన్లు మాట్లాడుతూ... ఎమ్మెల్యే విరుపాక్షి తమను ఏకగ్రీవం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. **ఆదోని (రూరల్)** మండలం సంతేకుడ్లూరు జడ్‌పి హైస్కూల్‌లో సిఐ నల్లప్ప, ఎస్ఐ నాగేంద్ర ఆధ్వర్యంలో బందోబస్తు మధ్య ఎన్నికలు మరోసారి వాయిదా పడ్డాయి. హానవాళ్లు గ్రామంలో విద్యా కమిటీ వైస్ ఛైర్మన్‌గా సిపిఎం మద్దతుదారులు పి.హుస్సేనమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఎం మండల నాయకులు బాష, స్థానిక నాయకులు దస్తగిరి బాష, అబ్దుల్ రహీం కృతజ్ఞతలు తెలిపారు. **కౌతాళం** మండలం తోవి ప్రాథమిక పాఠశాల ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడినట్లు ఎంఇఒ శోభారాణి తెలిపారు. కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. గ్రామంలోని వైసిపి, టిడిపి నాయకుల మధ్య పోటీ నెలకొనడంతో మొదటిసారిగా ఎన్నికలు వాయిదా వేశారు. శనివారం ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు శాతం తక్కువగా ఉందని అధికారులు వాయిదా వేశారు. కోసిగి సిఐ మంజునాథ్ పోలీసు సిబ్బందితో పర్యవేక్షించారు. **దేవనకొండ** మండలంలో వాయిదా పడిన పాలకుర్తి, మాదాపురం విద్యా కమిటీ ఛైర్మన్‌ల ఎన్నిక ఎంఇఒ తిమ్మారెడ్డి పర్యవేక్షణలో, పోలీసు బందోబస్తు మధ్య ముగిసింది. పాలకుర్తి వైసిపి, మాదాపురం టిడిపి మద్దతుదారులు ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. పాలకుర్తి ఎంపిపిఎస్ విద్యా కమిటీ ఛైర్మన్‌గా రవి, వైస్ ఛైర్మన్‌గా సరస్వతి, మాదాపురం ఎంపిపి పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్‌గా నాగరాజు, వైస్ ఛైర్మన్‌గా లక్ష్మి ఎన్నికయ్యారు.

ఆదోని రూరల్ : విద్యా కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని బేతపల్లి, పి.కోటకొండ గ్రామాల రహదారి మధ్యలో శనివారం ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు... కోడుమూరు మండలం కలపరి గ్రామానికి చెందిన బోయ మల్లికార్జున (36) అనే వ్యక్తి బేతపల్లి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడగా అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం పత్తికొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'మత్స్యకారులకు పింఛన్లు'

ప్రజాశక్తి - మంత్రాలయం

యాభై ఏళ్లు పైబడిన మత్స్యకారులకు ప్రభుత్వం నుంచి రూ.4 వేల పింఛన్లకు అర్హులని మత్స్య అభివృద్ధి అధికారి నాగరాజు తెలిపారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ రాఘవేంద్రను కలిసి శాఖకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మంత్రాలయం, నందవరం మండల ఇన్‌ఛార్జీగా బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రెండు మండలాల నుంచి 75 మంది మత్స్యకారులకు లైసెన్సులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన మత్స్యకారులు లైసెన్సు పొందేందుకు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఫొటోలు అందజేసి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. త్వరలో రాయితీ కింద ద్విచక్ర వాహనాలు, పుట్టీలు, వలలు ఇస్తామని, మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మండల అధికారి ఎం.హసీనాబీ ఉన్నారు.

ప్రభుత్వం ఎస్టీ వర్గీకరణ చేపట్టాలి

- గిరిజన, ఎరుకల హక్కులపై నిరంతర పోరు

- ఎరుకల హక్కుల పోరాట సమితి

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎస్టీ ఎబిసిడి వర్గీకరణను ప్రభుత్వం చేపట్టాల్సిన అవసరం ఉందని, గిరిజన, ఎరుకల హక్కుల కోసం నిరంతర పోరాటం చేస్తామని ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ మెంబర్ ఎ.రాజు, జిల్లా అధ్యక్షులు ఎరుకల కృష్ణ తెలిపారు. శనివారం స్థానిక రాగసుధ లాడ్జీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థిక చేయూత అందించాలని కోరారు. ఎరుకల బ్యాండ్ మేళా కళాకారులకు గుర్తింపు కార్డులను మంజూరు చేయడంతో పాటు పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు వేణుగోపాల్ రెడ్డి, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు మాట్లాడారు. నియోజకవర్గంలో గిరిజన, ఎరుకల విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఎరుకల హక్కుల పోరాట సమితి నియోజికవర్గ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సూగూరు గ్రామానికి చెందిన ఎరుకల బజారప్పను, ఎరుకల వెంకటేష్‌ను ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా ఎరుకల రామాంజినేయులు, ఆంజనేయులు, హనుమంతు, సహాయ కార్యదర్శులుగా మహేష్, నాగరాజు, కృష్ణమూర్తి, కోశాధికారిగా ఎరుకల సురేష్, భీమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నంద్యాల జిల్లా అధ్యక్షులు గోపాల్, ఆదోని డివిజన్ మానిటరింగ్ మెంబర్ రవికుమార్, డోన్ సెక్రటరీ చోటా రామయ్య, చిన్న భీమన్న, కోసిగి లక్ష్మన్న, రామలింగ, చిన్న పాండు పాల్గొన్నారు.

పంపకాల కోసమే పోట్లాట

- కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్

ప్రజాశక్తి - ఆదోని

ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దృష్టి మళ్లించేందుకు, పంపకాల కోసమే ఎన్‌డిఎ కూటమి నాయకుల మధ్య మాటల యుద్ధం జరుగుతోందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు దిలీప్ ఢోకా మండిపడ్డారు. శనివారం కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ఆదోని అభివృద్ధి జరగలేదని తెలిపారు. కూటమి అధికారంలోకి వస్తే అభివృద్ధి చేస్తామని హామీలిచ్చి ఇలా ఒకరిపైఒకరు విమర్శలు చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. పంపకాల కోసం రోడ్డున పడడం ఏమిటని నిలదీశారు. టిడిపి కార్యకర్తలను కూటమికి చెందిన బిజెపి ఎమ్మెల్యే పార్థసారథి పట్టించుకోవడం లేదని, అన్యాయం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆరోపించడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ఆదోని అభివృద్ధిపై ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించారన్నారు. ఎమ్మెల్యేగా పార్థసారథిని గెలిపిస్తే ఆదోనిని అభివృద్ధి చేస్తారని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఎన్నికల్లో ప్రచారం చేశారని గుర్తు చేశారు. తీరా వారి టిడిపి కార్యకర్తలకు న్యాయం చేయమని కోరడం ఏమిటని ప్రశ్నించారు. మరోవైపు ఎన్నికల్లో వైసిపి నేతల అవినీతిపై మాట్లాడిన ఎమ్మెల్యే పార్థసారథి.. ఇప్పుడెందుకు మాట్లాడడం లేదని, వైసిపి, కూటమి నాయకుల మధ్య ఏమైనా ఒప్పందం కుదిరిందా అని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో వైసిపి నాయకుల అక్రమాలను మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఏనాడూ ప్రశ్నించలేదని తెలిపారు. అప్పట్లో ఆదోనిలో టిడిపి, వైసిపి మధ్య 60-40 ప్రకారం పంపకాలుంటే.. ఎప్పుడు కూటమిలోని మూడు పార్టీల మధ్య విభజన జరిగిందని చెప్పారు. గతంలో ఎరువుల బస్తా ధర కంటే నేడు రూ.400 అధికంగా వసూలు చేసి అమ్ముతున్నారని, దానిపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఇలాగే ఉంటే ప్రజలు తిరగబడడం ఖాయమని, తాము సైతం ప్రజల పక్షాన ఉండి పోరాటం చేస్తామని హెచ్చరించారు. నాయకులు మారుతి, శ్రీనిత్, సాయినాథ్, నాగరాజ్ యాదవ్, హనుమంతు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ యాదవ్

KURNOOL MUNICIPAL CORPORATION

e-Procurement Notice

Tender Notice No.9-1 to 9-25/General Funds/EE&SE/Knl/24-25, dt. 13-08-2024 & Tender Notice No. 9-26/General Funds/EE&SE/Knl/24-25, dt. 13-08-2024 (7 days short tender)

Name of the Scheme	General Funds	General Funds (7 days short tender)
No. of Works	25	01
Bid document download starting date	19/08/2024 at 5:30 P.M.	19/08/2024 at 5:30 P.M.
Bid document download end date	06/09/2024 at 4:00 P.M.	27/08/2024 at 4:00 P.M.
Last Date & Time for receipt of Bids	06/09/2024 at 5:00 P.M.	27/08/2024 at 5:00 P.M.
Commerical Bid Opening Date	06/09/2024 at 5:30 P.M.	27/08/2024 at 5:30 P.M.

Further details and Corrigendum can be seen @ e-procurement market place at www.tender.eprocurement.gov.in. P.V. Ramalingeswar, Commissioner (F.A.C), Kurnool Municipal Corporation, Kurnool. For contact 9849908497, 9849908470

Sd/- P.V. Ramalingeswar,
Commissioner (F.A.C)
Kurnool Municipal Corporation, Kurnool.